# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-04-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశంలో లోక్‌సభ ఎన్నికల మొదటి దశలో భాగంగా 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని మొత్తం 102 లోక్‌సభ స్థానాలకు ఈరోజు పోలింగ్ జరగనుంది.**
2. **ఆంధ్రప్రదేశ్‌లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో రెండు కెమెరాలతో పర్యవేక్షిస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్ కుమార్ మీనా తెలిపారు.**
3. **లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఆన్‌లైన్‌లోనూ నామినేషన్ దాఖలు చేయవచ్చని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ తెలిపారు.**
4. **ఆంధ్రప్రదేశ్‌లోని 91 మండలాల్లో, తెలంగాణాలో కొన్ని జిల్లాల్లో ఈరోజు వడగాల్పులు వీస్తాయని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.**
5. **దుబాయ్‌లో కుంభవృష్టి కారణంగా చిక్కుకుపోయిన భారతీయుల కోసం అక్కడ దౌత్య కార్యాలయం హెల్ప్ లైన్ నెంబర్లు విడుదల చేసింది.**

==========================

దేశంలో లోక్‌సభ ఎన్నికల మొదటి దశ పోలింగ్ ఈ రోజు జరగనుంది. తొలి దశలో 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని మొత్తం 102 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరుగుతుంది. తమిళనాడులోని మొత్తం 39 స్థానాలు, ఉత్తరాఖండ్‌లోని 5, అరుణాచల్‌ప్రదేశ్‌లోని 2, మేఘాలయలో 2, అండమాన్ నికోబార్‌లో 1, మిజోరాంలో 1, పుదుచ్చేరిలో 1, సిక్కిం, లక్షద్వీప్‌లో ఒక్కో స్థానానికి ఈ రోజు ఎన్నికలు జరుగుతాయి. ఇవి కాకుండా రాజస్థాన్‌లో 12, ఉత్తరప్రదేశ్‌లో 8, మధ్యప్రదేశ్‌లో 6, అసోం, మహారాష్ట్రల్లో 5, బిహార్‌లో 4, పశ్చిమ బంగలో 3, మణిపూర్‌లో 3, జమ్మూ-కశ్మీర్, ఛత్తీస్‌గఢ్, త్రిపురలో ఒక్కో స్థానానికి ఈ రోజు పోలింగ్ జరగనుంది.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో రెండు కెమెరాలతో పర్యవేక్షిస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్ కుమార్ మీనా తెలిపారు. నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 180 కోట్ల రూపాయల నగదు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు, పాడేరు, రంపచోడవరంలో మే 13వ తేదీ ఉదయం 7గంటల నుంచి సాయంకాలం 4 గంటల వరకు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ, కురుపాం, సాలూరులో ఉదయం 7గంటల నుంచి సాయంకాలం 5 గంటల వరకు. రాష్ట్రంలోని మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో ఉదయం

7గంటల నుంచి సాయంకాలం 6గంటల వరకు పోలింగ్ జరుగుతుందని ముఖేష్ కుమార్ మీనా వెల్లడించారు.

---------------------------

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఆన్‌లైన్‌లోనూ నామినేషన్ దాఖలు చేయవచ్చని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ తెలిపారు. అయితే, ఈ నెల 24వ తేదీ లోగా ప్రింట్ తీసుకొని సంబంధిత రిటర్నింగ్ అధికారికి అందజేయాలని సూచించారు. హైదరాబాద్‌లో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. నామినేషన్ పత్రాలు, అఫిడవిట్ జాగ్రత్తగా నింపాలని, మూడు సెట్ల నామినేషన్ పత్రాలు, వాటితోపాటు 5 ఫోటోలు ఇవ్వాలని తెలిపారు. అఫిడవిట్‌లోని ప్రతి పేజీలో సంతకం చేయాలని, ప్రతి కాలమ్ నింపాలని పేర్కొన్నారు. ఎన్నికల ఖర్చు నిమిత్తం అభ్యర్థి బ్యాంకు ఖాతా తెరవాలని స్పష్టంచేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ, పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి మొత్తం 25 పార్లమెంటు నియోజకవర్గాలకు గాను 20 స్థానాల్లో నిన్న 39 మంది అభ్యర్థులు 43 నామినేషన్లు దాఖలు చేశారు. 175 శాసనసభ స్థానాలకుగాను 101 నియోజకవర్గాల్లో 190 మంది అభ్యర్థులు 236 నామినేషన్లు దాఖలు చేశారు. అత్యధికంగా గుంటూరు పార్లమెంట్ స్థానానికి ఐదుగురు, ఒంగోలుకు నలుగురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. విశాఖపట్నం, కర్నూలుకు ముగ్గురు చొప్పున, విజయనగరం, విజయవాడ, నరసరావుపేట, బాపట్ల, నంద్యాల, అనంతపురం, కడప, రాజంపేట లోక్‌సభ స్థానాలకు ఇద్దరు చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. అనకాపల్లి, కాకినాడ, నరసాపురం, ఏలూరు, హిందూపురం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి లోక్‌సభ స్థానాలకు ఒక్కొక్కరు నామినేషన్ వేశారు.

---------------------------

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర నిన్న ఉభయ గోదావరి జిల్లాల్లో ముగిసింది. ఈ రోజు కాకినాడ జిల్లాల్లో యాత్ర కొనసాగనుంది. విజయవాడలో జరిగిన రాయిదాడి ఘటన నేపథ్యంలో పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. మొబైల్ కమాండింగ్ వాహనాన్ని ఏర్పాటు చేశారు. రోడ్ షో పొడవునా ప్రత్యేక బలగాలు మోహరించాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

---------------------------

పశ్చిమాసియాలో ప్రధాన ఆర్థిక కేంద్రమైన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్.. యుఎఈలోని దుబాయ్ నగరంలో 75 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా కుంభవృష్టి కురవడంతో అక్కడి జనజీవనం స్తంభించింది. నిత్యం రద్దీగా ఉండే దుబాయ్ విమానాశ్రయంలో నీరు నిలిచిపోవడంతో విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వేలాదిమంది ప్రయాణికులు ఎయిర్‌పోర్టుల్లోనే వేచి చూస్తున్నారు. ఈ క్రమంలో దుబాయ్ నగరంలో చిక్కుకుపోయిన భారతీయుల కోసం అక్కడి దౌత్య కార్యాలయం హెల్ప్‌లైన్ నెంబర్లు విడుదల చేసింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో దుబాయ్, ఉత్తర ఎమిరేట్స్ ప్రాంతాల్లో చిక్కుకుపోయిన భారత పౌరులు సాయం కోసం +971501205172, +971569950590, +971507347676, +971585754213 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించింది. సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు ఈ హెల్ప్‌లైన్ నెంబర్లు కొనసాగుతాయని తెలిపింది.

---------------------------

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎండ తీవ్రత పెరిగింది. నిన్న ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా

యెర్రంపేట, మన్యం జిల్లా కొమరాడలో 45.8, నంద్యాల జిల్లా నందవరంలో 45.6, విజయనగరం జిల్లా జామిలో 45.5, శ్రీకాకుళం జిల్లా కోవిలం, వైఎస్ఆర్ జిల్లా కొంగలవీడులో 45.4, తిరుపతి జిల్లా రేణిగుంట, ప్రకాశం జిల్లా దరిమడుగులో 45.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే 84 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 120 మండలాల్లో మోస్తరు వడగాల్పులు వీచాయి. ఈరోజు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని 91 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. కోస్తాంధ్ర, రాయలసీమలో వైఎస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని 245 మండలాల్లో వడగాడ్పులు వీస్తాయని తెలిపింది. అటు.. తెలంగాణలోనూ ఈ రోజు, రేపు కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ వడగాల్పులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్‌లోని భారత వాతావరణ కేంద్రం హెచ్చరించింది. కొన్ని జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల వరకు పెరిగే సూచనలు ఉన్నాయని వెల్లడించింది. రాబోయే మూడు రోజులు కొన్నిజిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రేపు ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడొచ్చని వాతావరణ కేంద్రం వివరించింది.

---------------------------

వేసవిలో తాగునీటి అవసరాల కోసం రెండు తెలుగు రాష్ట్రాలకు నీటిని కేటాయిస్తూ కృష్ణానది యాజమాన్య బోర్డు నీటి విడుదల ఉత్తర్వులు జారీ చేసింది. నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని నాగార్జునసాగర్‌లో 500 అడుగుల నీటి మట్టం వరకు, 14.195 టీఎంసీల మేర నీటి లభ్యత ఉంది. అందులో ఆంధ్రప్రదేశ్‌కు 5.5 టీఎంసీలు.. మిగిలిన నీరు హైదరాబాద్ సహా ఇతర జిల్లాల తాగునీటి అవసరాల కోసం వినియోగానికి తెలంగాణకు అనుమతిచ్చారు. నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని పూర్తిగా తాగునీటి అవసరాల కోసమే నీటిని వినియోగించుకోవాలని కృష్ణానది యాజమాన్య బోర్డు స్పష్టం చేసింది.

---------------------------

స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన క్రూజ్ క్షిపణి ని భారత్ గురువారం విజయవంతంగా పరీక్షించింది. ఒడిశాలోని చాందీపుర్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ –ఐ.టీ.ఆర్ నుంచి నిర్వహించిన ఈ పరీక్షలో క్షిపణికి సంబంధించిన అన్ని ఉపవ్యవస్థలు నిర్దేశిత రీతిలోనే పనిచేశాయని అధికారులు పేర్కొన్నారు. ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించిన రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ –డీ.ఆర్.డీ.వో. శాస్త్రవేత్తలను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. దేశీయ చోదక వ్యవస్థతో కూడిన క్షిపణిని అభివృద్ధి చేయడం భారత పరిశోధన ప్రస్థానంలో కీలక మైలురాయి అని ఆయన అభివర్ణించారు.

---------------------------

తెలంగాణ రాష్ట్రంలో మూతపడిన 25 భూసార పరీక్ష కేంద్రాలను పునరుద్ధరించాలని... నేల పోషక విలువలు, ఆరోగ్య సమాచార సేవలను రైతులకు అందుబాటులోకి తేవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. భూసార పరీక్ష కేంద్రాలపై నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడతూ.. ఈ పరీక్ష కేంద్రాలు అందుబాటులోకి తేవడం ద్వారా సాగు ఖర్చును గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. వచ్చే వానాకాలంలోపు మినీ సాయిల్ టెస్టింగ్ కిట్‌లను రైతు వేదికలలో సహకార సంఘాలు, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు.

---------------------------

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ గౌతులచ్చన్న వర్ధంతి ఈరోజు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వ్యక్తి గౌతులచ్చన్న. కుల, మతాలకు ఆతీతంగా ప్రజలకు దారిచూపిన మహోన్నత వ్యక్తి ఆయన. అణగారిన వర్గాల సంక్షేమానికి విశేష కృషిచేసిన ఆ మహనీయునికి ప్రజలు ఘనంగా నివాళులర్పిస్తున్నారు.

======================